విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 19 మార్చి 2025 8 పేజీలు

నీటి కష్టాలు తప్పవా!

- ఏలూరు వాసులకు తాగునీటి కష్టాలు
- రిజర్వాయర్లలో తగ్గిపోతున్న నీటిమట్టాలు

విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు: ఏలూరు నగరానికి వేసవిలో మంచినీటి సమస్య తలెత్తనుందా...?అంటే అవును అనే సమాధానం వస్తోంది. ఎందుకంటే దెందులూరు ఆశ్రమం ఆసుపత్రి వద్ద ఎస్ఎస్ ట్యాంక్, ఏలూరు హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర మూడు రిజర్వాయర్లు నీటి మట్టాలు రోజురోజుకు పడిపోతున్నాయి. మరో పక్క ధవళేశ్వరం నుంచి వచ్చే గోదావరి కాలువ, విజయవాడ నుంచి వచ్చే కృష్ణా కాలువలలో నీరు లేదు. ఈ రెండు కాలువలలో నుంచి నీటిని పంపించేసే ప్రదేశాలలో మట్టి, బురద, ఇసుక కనిపిస్తున్నాయి. నీటిని పంపిణీ చేసేందుకు అవకాశం లేదు. ఒకవేళ బలవంతంగా నీటిని పంపు చేసినా మట్టి చేరిపోయి మోటర్లు పాడై పోతాయి. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ధవళేశ్వరం నుంచి తాగునీరు విడుదల ఈనెల 20వ తేదీన జరగవచ్చునని అంటున్నారు. ఈ విడుదల కొద్ది రోజులు అనుకోని పరిస్థితులలో ఆలస్యమైతే నగరంలో మంచి నీటి సమస్య తలెత్త డం ఖాయంగా కనిపిస్తోంది.

ఇప్పటికే జిల్లా యంత్రాంగం, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ బేగం, కమిషనర్ భాను ప్రకాష్ నగరంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు ఇప్ప టికే ప్రారంభించినట్లు తెలుస్తోంది.

ఆదాయం 5 కోట్లు... ఖర్చు 27 కోట్లు

ఏలూరు నగరంలో ఉన్న 42,000 పైచిలుకు ఉన్న కుళాయి కనెక్షన్లకు వాటర్ టాక్స్ రూపంలో ఏడాదికి ఏలూరు నగరపాలక సంస్థకు రూ.5 కోట్ల పైగా ఆదాయం లభిస్తుంది. ఏలూరు కార్పొరేషన్‌లో 50 డివిజన్లు, నూతనంగా విలీనమైన 7 పంచాయతీలలో ఉన్న సుమారు 3.25 లక్షల మంది జనాభాకు తాగునీటిని అందిస్తున్నందుకు, ఏడాదికి సుమారు రూ.27 కోట్లు ఖర్చు అవుతోంది. ఇందులో మేజర్ ఖర్చు ఏడాదికి రూ.18 కోట్లు కేవలం విద్యుత్ బిల్లులకే నగరపాలక సంస్థ చెల్లిస్తోంది. నెలవారీగా చూస్తే హై టెన్షన్ లైన్లకు నెలకు రూ.50 లక్షలు, ▶మిగతా 2లో..

సైనిక విన్యాసాలకు సహకారమివ్వండి

జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ తీరంలోని నేవల్ ఎన్‌క్లేవ్‌లో వచ్చే ఏప్రియల్ 8 నుండి 13వ తేదీ వరకూ భారత్, అమెరికా వాయుసేనా దళాలు ఉమ్మడిగా నిర్వహించనున్న టైగర్ ట్రియంఫ్-25 సైనిక విన్యాసాల కొరకు అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు అధ్యక్షతన ఆయన ఛాంబరులో ఏప్రియల్ 8 నుండి 13 వరకూ కాకినాడ తీరంలో సైనిక విన్యాసాల నిర్వహణపై సైనిక, ▶మిగతా 2లో..

41 పరిశ్రమలకు అనుమతులు

- 13 పరిశ్రమలకు 1.68 కోట్ల ప్రోత్సాహకాలు
- జిల్లాలోని వివిధ పరిశ్రమల ఉత్పత్తులకు డిజిటల్ మార్కెటింగ్ సౌకర్యాలు పెరిగేలా చర్యలు
- భద్రతా నిబంధనలు పాటించని పరిశ్రమలపై కేసులు నమోదు చేయండి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో 41 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ, జిల్లా పారిశ్రామిక భద్రతా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, ప్రభుత్వ ప్రాధాన్యతను ననుసరించి పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులకు సింగిల్ విండో పథకం ద్వారా ▶మిగతా 4లో..

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు లో భాగంగా మంగళవారం జంగారెడ్డిగూడెం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సహాయ కార్యదర్శి కూనపాముల విగ్నేష్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లను మార్చి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వలన ఇప్పటివరకు పనిచేసిన విద్యుత్ మీటర్ రీడర్స్ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే వృత్తిని నమ్ముకొని చాలా కాలం నుండి మీటర్ రీడర్స్ జీవిస్తున్నారని, ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల ఉద్యోగాలు కోల్పోయి జీవనోపాధికి దూరమవుతున్నారన్నారు. మీటర్ రీడర్స్‌కి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించి నెల నెలా వేతనాలు చెల్లించాలని, మధ్యవర్తి ఏజెన్సీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థలో కలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీటర్ రిడర్స్ జిల్లా కోశాధికారి కె.మల్లేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి కె శ్రీనివాసరావు, ఎం.వి ధర్మరాజు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, చింతలపూడి, జీలుగుమిల్లి, కామవరపుకోట సబ్ డివిజన్ విద్యుత్ మీటర్ రీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధికి వచ్చే భక్తులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శంఖవరం మండలం అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో వి.సుబ్బారావు, వేద పండితులు జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రధాన ఆలయం, యంత్రాలయంలోని స్వామివారిని దర్శించుకున్నారు. నిత్య కళ్యాణ మండపం పక్కన ఉన్న మరుగుదొడ్లను కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించారు. కొండవాలు ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రదేశాలను నెలకు ఒకసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పంపా రిజర్వాయర్ లోని స్నానాల ఘాట్‌ను, ▶మిగతా 2లో..

మంచినీటి ప్రాజెక్టు పనుల్లో అవినీతి

విశాలాంధ్ర - అమలాపురం : అల్లవరం మండలం బెండమూర్లంక ఆర్‌డబ్ల్యూఎస్ మంచి నీటి ప్రాజెక్టు పనుల్లో అవినీతి తాండవిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్టు పనులు ఎంతకు చేస్తున్నారో అంచనాలు బయటకు చెప్పకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు గుట్టుచప్పుడు కాకుండా పనులు జరిపించేస్తున్నారు. నాణ్యతకు పాతరేసి మామూళ్లతో ఇష్టారాజ్యంగా నడిపిస్తున్నారు. క్వాలిటీ మట్టిని తెచ్చి చెరువులో వేయాల్సి వుండగా ఎలాంటి నాణ్యత లేని మట్టిని తరలించి చెరువులో డంప్ చేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువును బలంగా క్వాలిటీగా పనులు చేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించింది. కొమరగిరిపట్నం గ్రామంలో ఆనాడు కీ.శే. నడింపల్లి సుబ్బరాజు, ఆనాటి మాజీ ముఖ్యమంత్రి ▶మిగతా 2లో..

ఫ్రీ ఫైర్ గేమ్‌తో వేలాది రూపాయలు నష్టపోతున్న యువత

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణాన్ని ఆనుకుని ఉన్న పరింపూడి గ్రామ రామాలయం వద్ద యువత మంగళవారం ఆన్‌లైన్ ఫ్రీ ఫైర్ గేమ్‌లో మునిగి పోయారు. డబ్బులు బెట్టింగులు కడుతూ ఈ గేమ్ ఆడుతున్న యువత వారికి తెలియకుండానే ఫ్రీఫైర్ గేమ్ వ్యసనానికి బానిసలు అవుతు న్నారు. ఉదయం లేచిన తర్వాత మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి తేడా లేకుండా సెల్ ఫోన్ ఫ్రీ ఫైర్ గేమ్లో తేలి ఆడుతున్నారు. కొంతమంది యువత అప్పులు చేసి గేమ్‌ను ఆడటం వలన కుటుంబాలలో కలహాలు మొదలవుతున్నాయి. యువత క్రమశిక్షణలో ఉన్నప్పుడే సమాజం, కుటుంబం బాగుంటుందని చూపరులు వాపోతున్నారు.

ఉత్తమ దర్శకుడు నవీన్‌కు అభినందనలు

విశాలాంధ్ర- కామవరపుకోట: హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా అనే లఘు చిత్రానికి దర్శకత్వం వహించి ఉత్తమ దర్శకుడిగా అవార్డు పొందిన లొట్ల నవీన్‌కు ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు కళాభివందనలు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఎల్ఆర్ కృష్ణబాబు బుర్రకథ కళాకారునిగా రంగస్థలంపై గజ్జెకట్టి బుర్రకథలో హాస్యం చెప్పి కీర్తి గడించి జానపద కళాకారునిగా ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాదిమంది కళాభిమానులను సొంతం చేసుకున్నారు. ఆయన కుమారుడు నవీన్ కూడా తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని లఘు చిత్రానికి ఉత్తమ దర్శకునిగా ఎన్నికవడం అభినందనీయమని టీవీఎస్ రాజు అన్నారు. నవీన్‌కు ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమళ్ళ సత్యనారాయణ,బచ్చు నందకుమార్, సీనియర్ రంగస్థలం కళాకారుడు తిరుపతి రమేష్ బాబు,కళా ప్రోత్సాహకులు, కళాభిమానులు, సాయన రాఘవమ్మ చారిట బుల్ ట్రస్ట్ చైర్మన్ సాయన కనకరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరమళ్ళ మధుసూదన్ రావు,తదితరులు నవీన్‌కు అభినందనలు తెలిపారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థల వారు, ఆపద్బాంధవులు ముందుకు రావాలని బాలం నరేష్ పేర్కొన్నారు. మండలంలో బయ్యనగూడెం గ్రామంలో ఇటీవల కాలంలో గ్రామానికి చెందిన మిద్దె శ్రీను తాటాకు ఇల్లు ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు గురై పూర్తిగా అగ్నికి ఆహుతవడంతో కట్టు బట్టలతో నిరాశ్రయులైన ఉన్న శ్రీను కుటుంబానికి తపన ఫౌండేషన్ తరపున రూ.5వేల విలువ గల నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కటిక. రాధాకృష్ణ,ఆరేటి ఏసు బాబు, ఎర్రావుల బాబూరావు, కలవగంటి శ్రీను, రామారావు, సూర్య నారాయణ, భోగరాజు రమేష్, కటిక పవన్, సుంకర శివ పాల్గొన్నారు.

అవినీతి (1వ పేజీ తరువాయి)

కీ.శే. ఎన్టీ రామారావుని కొమరగిరిపట్నం గ్రామానికి తీసుకొచ్చి మంచినీటి ప్రాజెక్ట్ నెలకొల్పడానికి శ్రీకారం చుట్టారు. ఆ నాటి నుండి ఈ నాటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారిన కొమరగిరిపట్నం గ్రామంలోని ప్రజలకు పూర్తి స్థాయిలో త్రాగు నీరు అందించడంలో విఫలం అయ్యారు. నేడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలతో ప్రతి కుటుంబానికి పూర్తి స్థాయిలో మంచి నీరు అందించాలనే కృషితో కొమరగిరిపట్నం మంచినీటి ప్రాజెక్ట్‌కు కోట్లాది రూపాయలు మంజూరు చేసి చెరువు అభివృద్ధి పనులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ చెరువు పై కీ.శే. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కయ్యి ప్రభుత్వ ఆశయానికి విరుద్ధంగా పనులు చేయిస్తున్నారు. మంచి నీటి ప్రాజెక్ట్ పనులు పై ఆరా తీసి నాణ్యతతో కూడిన పనులు చేసి అభివృద్ధి చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

యంపిపి పాఠశాల కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -పెదపాడు: పెదపాడు మండలం వట్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు.అక్కడి పిల్లలతో కలెక్టర్ మమేకమై వారి విద్యాబోధనపై ఆరాతీశారు. పిల్లలతో కలిసికూర్చొని వారి పాఠ్యపుస్తకాలను పరిశీలించి అందులోని అంశాలను, బాల బాలికలతో చదివించారు. ఈ సందర్భంగా వారు చెప్పిన సమాధానాలకు కలెక్టర్ ముచ్చటపడుతూ పిల్లలను అభినందించారు. అకడమి కల్‌గా బెస్ట్ స్కూల్‌గా ఉన్న ఈ పాఠశాల మరింత ఉన్నత ప్రమాణాలతో పిల్లలకు విద్యాబోధన అందించాలన్నారు. అనంతరం

విద్యార్థుల హాజరు పట్టీని కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలకు మంగళవారం 27 మంది బాల బాలికలకు, 18 మంది హాజరుకావడం గుర్తించారు.ఒక విద్యార్థి కొంత కాలంగా పాఠశాలకు రానప్పటికీ హాజరు నమోదు చేయడంపై సంబంధిత ఉపాధ్యాయుడు,తనిఖీ చేయవల్సిన ఎంఇఒను కలెక్టర్ మందలించారు. ఇటువంటి సంఘటనలు పునరావతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. సావిత్రి, ఉపాధ్యాయుడు జి.వి. రంగామోహన్ లను పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం అమలు తీరును ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. వీరి వెంట ఏలూరు ఆర్డిఓ అచ్యుత్ అంబరీష్, యంపిడివో అమిల్ జామ, ఎంఇఓ ఎస్. నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు.

సహకారమివ్వండి
(1వ పేజీ తరువాయి)

సివిల్ అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సివిల్-మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వైకె కిషోర్ మాట్లాడుతూ భారత్, అమెరికా వాయుసేనల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రియల్ 1 నుండి 13వ తేదీ వరకూ టైగర్ ట్రియంఫ్-25 పేరిట ఉమ్మడి సైనిక విన్యాసాలను విశాఖపట్నం, కాకినాడ తీరాలలో నిర్వహించ నున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రియల్ 8 నుండి 13వ తేదీ వరకూ కాకినాడ తీరంలోని నేవల్ ఎన్ క్లేవ్‌లో యాంఫీబియస్ విన్యాసాలు సముద్రంలోను, ఉపరితలంపైన జరుగుతాయని, ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ మేరకు సైనికాధికారులు కోరిన అంశాలపై శాఖల వారిగా చేపట్టవలసిన చర్యలను డిఆర్ఓ వెంకట్రావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. విన్యాసాలు జరిగే ప్రాంతంలో స్టేట్ హైవే బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు, క్రౌడ్ నియంత్రణ అంశాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. సైనిక అధికారులు, సిబ్బంది, సామాగ్రిని విశాఖపట్నం, కాకినాడల మధ్య సంచరించే రూట్లలో రోడ్ కాన్వాయ్ ఆపరేషన్స్‌కు అవసరమైన సహకారాన్ని సైనిక అధికారులకు అందించాలన్నారు. సముద్రంలో విన్యాసాలు జరిగే ప్రాంతానికి సమీపంలోకి మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్య శాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రియంఫ్-25 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో సహకరించాలని డిఆర్ఓ వెంకట్రావు కోరారు. ఈ సమావేశంలో సైనిక అధికారి టివివి ప్రసాద్, మైరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్ రెడ్డి, రూరల్ సిఐ చైతన్య కృష్ణ, ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీ, మత్స్యశాఖ అధికారి అనూరాధ, కెఎస్పిఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, పంచాయితీ, ఇంటిలిజెన్స్, సమాచార శాఖల అధికారులు పాల్గొన్నారు.

చర్యలు (1వ పేజీ తరువాయి)

పోలవరం లెఫ్ట్ కెనాల్ అక్విడేట్ పనులను ఇరిగేషన్, పోలవరం కెనాల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు, రానున్న ఏప్రిల్, మే నెలల్లో జరిగే చక్రస్నానం స్వామివారి కళ్యాణం, శ్రీరామనవమి వంటి కార్యక్రమంలో నేపథ్యంలో పంప రిజర్వాయర్లు నీరు, పోలవరం కెనాల్ నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యదేవుని దర్శనం నిమిత్తం దేవాలయానికి వచ్చే భక్తులకు అవసరమైన తాగునీరుకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రానున్న ఏప్రిల్, మే నెలల్లో జరిగే చక్రస్నానం స్వామివారి కళ్యాణం, శ్రీరామనవమి వంటి కార్యక్రమంలో నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి. రామ కృష్ణ, వి. నూకరత్నం, ఇరిగేషన్ ఈఈ జి శేషగిరిరావు, పోలవరం కెనాల్ ఈఈ డి. శ్రీనివా సులు శంఖవరం తహసీల్దార్ ఎ. తాతారావు, ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ, ఆర్డబ్ల్యూఎస్ డీఈ కె. శ్రీదేవి, అన్నవరం గ్రామ సర్పంచ్ చెట్టిబత్తుల కుమార్ రాజా, విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, దేవస్థానం ఏఈలు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఈఈ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తప్పవా!
(1వ పేజీ తరువాయి)

లోటెన్షన్ లైన్లకు రూ.20 లక్షలు, పంచాయతీలకు రూ.80లక్షలు కలిపి నెలకు కోటిన్నర చొప్పున ఏడాదికి రూ. 18 కోట్లు విద్యుత్ బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ఇవి కాకుండా తాగు నీటిని శుభ్రం చేయడానికి వినియోగించే క్లోరిన్ సిలిండర్లు, బ్లీచింగ్ తదితరాలతోపాటు 50 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల, ఐదుగురు పర్మనెంట్ ఉద్యో గుల జీతాలు కలిపి ఏడాదికి సుమారు రూ.9 కోట్ల పైచిలుకు ఖర్చు అవుతోంది.

దెందులూరు వద్ద ఎస్ఎస్ ట్యాంక్ పరిస్థితి ఇది

నగరంలో జనాభా 3.24 లక్షలు ఉంటుంది. వీరికి తాగునీటిని అందించేందుకు దెందులూరు వద్ద 117 ఎకరాలలో 3000 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన రా వాటర్ స్టోరేజీ ఎస్ఎస్ ట్యాంకును ఏలూరు కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గోదావరి వెస్ట్రన్ కెనాల్ నుంచి సేకరించిన నీటిని 36 రోజులు ఈ ట్యాంకులో నిల్వ చేసుకోవచ్చు. దెందులూరు ఎస్ఎస్ ట్యాంక్‌లో గత నెల 28 నాటికి 1560.87 మిలియన్ లీటర్ల నీరు నిల్వ ఉంది. గడచిన 15 రోజుల వ్యవధిలో ఈ నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. దెందులూరు ఎస్ ఎస్ ట్యాంక్ పూర్తి సామర్థ్యం 16.75 మీటర్లు ఉంటుంది. వాటర్ లెవెల్ 6.75 మీటర్లు ఉంటుంది. ప్రస్తుతం దెందులూరు ఎస్ఎస్ ట్యాంక్ వద్ద నీటిమట్టం 8.00 మీటర్లు ఉండవచ్చునని తెలుస్తోంది.

కాలువలో మట్టి, ఇసుక కనపడు తోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీరు విడుదలై ఏలూరు చేరుకుంటే తప్ప దెందులూరు వద్ద గోదావరి కాలవ నుంచి ఆశ్రమం ఎస్ఎస్ ట్యాంక్‌లోకి నీటిని తోడేందుకు అవకాశం లేదు. ధవళేశ్వరం వద్ద నుంచి దెందులూరు వరకు నీరు చేరుకోవడానికి ఎన్ని రోజులు పడుతుంది అన్నది ఖచ్చితంగా చెప్పలేము. ధవళేశ్వ రం నుంచి దెందులూరు ఎస్ ఎస్ ట్యాంక్ వరకు నీటి ప్రవాహానికి ఆనుకొని అవాంతరాలు ఏవైనా ఎదురైతే... ఎస్ ఎస్ ట్యాంక్ ను నీటితో నింప డానికి మరింత ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఉన్న నీటిని ప్రజలు కూడా పొదుపుగా వాడుకోవాలని అధికారులు అంటున్నారు.

ఏలూరు హెడ్ వాటర్ వర్క్స్‌లో పంపుల చెరువు పరిస్థితి ఇది...

కృష్ణ కాలువ నుంచి పంపుల చెరువులోకి లిఫ్ట్ చేసి 680 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన తాగు నీటిని నిలవ చేయవచ్చు. పంపుల చెరువు రిజర్వాయర్‌లో ఈనెల 28 నాటికి 390 మిలియన్ లీటర్లు నీటి నిల్వలు ఉన్నాయి. ఇవి తొమ్మిది రోజులకు సరిపడే విధంగా ఉన్నాయని కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ప్రస్తుతం ఆ నీటిని నిల్వ పరిమాణం బాగా తగ్గిపోయింది. 14 అడుగుల అత్యధిక నీటిమట్టం సామర్థ్యం కలిగిన పంపుల చెరువులో ప్రస్తుత నీటిమట్టం 6 అడుగుల వరకు మాత్రమే ఉందని అంచనా వేస్తున్నారు.

వాటర్ సప్లై విభాగంలో వెయ్యి మంది ఉద్యోగులు

ఏలూరు వన్ టౌన్ టూ టౌన్ ప్రాంతాల్లో గల 26 రిజర్వాయర్లు, ఏడు పంచాయతీల పరిధిలోని బోర్లు, ఏలూరు హెడ్ వాటర్ వర్క్స్, దెందు లూరు ఎస్ ఎస్ ట్యాంకు, నగరపాలక సంస్థ కార్యాలయంలోని వాటర్ సప్లై విభాగంతోపాటు అన్నిచోట్ల కలిపి మొత్తం వెయ్యి మంది వరకు ఉద్యోగులు మంచినీటి సరఫరా విభాగంలో సేవలను అందిస్తున్నారు.

ఏలూరు నగరంలో మంచినీటి సమస్య ఉత్పన్నం కాదు... నగర కమిషనర్ ఎ. భాను ప్రకాష్

ప్రస్తుతం ఏలూరు నగర కార్పొరేషన్ పరిధిలో ఎటువంటి మంచినీటి సమస్య లేదు అని నగర కమిషనర్ ఎ.భాను ప్రకాష్ అన్నారు. ఎప్పటిలాగే నగర ప్రజలకు భవిష్యత్తులో రెండు పూటలా పుష్కలంగా మంచినీరు సరఫరా జరుగుతుందని అన్నారు. ఈనెల 20 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ధవలేశ్వరం వద్ద ఇరిగేషన్ అధికారులు తాగునీటిని విడుదల చేస్తారని ఆయన చెప్పారు. ఆ నీటితో దెందులూరు ఆశ్రం ఆస్పత్రి వద్ద గల

ఎస్ ఎస్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నింపుతా మన్నారు. ఈ ట్యాంకులను తాగునీటితో నింపేందుకు ఇప్పటికే 20 హెచ్ పి మోటర్లు 10 ,90 హెచ్ పి మోటర్లు రెండు ,60 హెచ్ పి మోటర్ ఒకటి ,50 హెచ్ పి మోటర్లు మూడు కలిపి మొత్తం 220 హెచ్‌పి సామర్థ్యం కలిగిన 16 మోటర్లను నీటిని తోడేందుకు సిద్ధం చేశామన్నారు. దెందులూరు వద్ద ఎస్ఎస్ ట్యాంక్‌ను నింపే సమయంలో ధవళేశ్వరం నుంచి దెందులూరు వరకు పంట బోదెలు వద్ద, చేపల చెరువులు గట్ల వద్ద రెవెన్యూ ,పోలీసు ,మున్సిపల్ సిబ్బంది పహార కాస్తారని అన్నారు. ధవళేశ్వరం నుంచి దెందులూరు వద్దకు గోదావరి జలాలు వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో మంచినీటితో ఎస్ఎస్ ట్యాంకులను నింపి ప్రజల అవసరాలు తీరుస్తామని చెప్పారు.

స్కూల్ యూనిఫామ్ నేరుగా పిల్లలకు అందజేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టనున్న యూనిఫామ్ లను, నేరుగా విద్యార్థులకు, లేక వారి తల్లిదండ్రులకు అందచేయాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక వినాయకుని ఆలయం వద్ద టైలర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆంజనేయరాజు మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ పార్టీలకు సంబంధించి రంగులు, గుర్తులు లేకుండా వచ్చే జూన్ నెలలో విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో, విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రవేశ పెట్టనున్న విద్యార్థినీ విద్యార్థుల యూనిఫాంలను నేరుగా తల్లిదండ్రులకు అందజేయడం ద్వారా చేతి వృత్తినే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న మిషన్ టైలర్లకు ఉపాధి కలుగుతుందని ఆంజనేయ రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విలియం హెచ్ శ్రీ గణపతి రామ టైలర్స్ సంఘ సభ్యులు చెప్పల మధుబాబు, సంకు కృష్ణ, స్వామి, రమణ రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దిరుసుమర్రులో దళిత సంఘాల ధర్నా

విశాలాంధ్ర -భీమవరం: దళితుల పంట భూమిని ఆక్రమించిన పెత్తందారులు అధికారుల అండతో దాన్ని స్మశాన వాటిక భూమి అనటం తగదని దళితుల భూములు జోలికొస్తే సహించేది లేదని దళిత జెఎసి కన్వీనర్ కన్వీనర్ బందెల రాజు, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ హెచ్చరించారు. భీమవరం మండలం దిర్సుమర్రు గ్రామంలో దళితుడైన గూడపాటి శాంతారావు పంట భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, అధికారులను పక్కదోవ పట్టించి గొడవలు పెడ్తున్న పెత్తందారుల చర్యలను నిరసిస్తూ మంగళవారం దిరుసుమర్రులో దళిత సంఘాల ధర్నా ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంట భూమి యజమాని గూడపాటి శాంతారావు కుటుంబీకులు పొలంను చెరువు నిమిత్తం తవ్విస్తుండగా పెత్తందారులు అడ్డుకోవడం దారుణమన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గూడపాటి దాని యోలు, పి.విజయ కుమార్, తలకాయాల జాన్ కెనడి, ఈదా దానియేలు, తోకల మార్తరాజు, టి.థామస్, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు

విశాలాంధ్ర-లింగపాలెం: సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టారు. లింగపాలెం మండలంలో ధర్మాజీగూడెం లోని బాలుర,బాలికల సింగగూడెం బాలుర వసతిగృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ. 55 లక్షలు కేటాయించింది. ధర్మాజీగూడెం బాలురవసతి గృహ మరమ్మతుకు రూ.27 లక్షలు,ఇదే గ్రామంలోని బాలికల వసతిగృహ మరమ్మతుకు రూ.19 లక్షలు, సింగగూడెం బాలుర వసతిగృహ మరమ్మతుకు రూ.9 లక్షలు కేటాయించారు. వీటి మరమ్మతు పనులను చేస్తున్నారు. ధర్మాజీ గూడెంలోని బాలుర, బాలికల వసతి గృహాలు నిర్మించి 30 ఏళ్లు అవుతుంది. దీర్ఘకాలికంగా నిర్మించిన ఈవసతి గృహాలలో అనేక సమస్యలు ఉన్నాయి. ఒక్కొక్క వసతి గృహంలో 120మంది పైగా బాలురు, బాలికలు ఉంటున్నారు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా మరమ్మతులు జరిగాయే తప్పా పక్కగా సౌకర్యాలు కల్పించలేదు. దీంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి వీటి మరమ్మతులకు చర్యలు తీసుకోవడం పట్ల వసతి గృహాలలో చదివే విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మీటర్ రీడర్ల పొట్టలు కొట్టొద్దు

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు

విశాలాంధ్ర -నరసాపురం: విద్యుత్ స్మార్ట్ మీటర్స్ పేరుతో విద్యుత్ మీటర్ రీడర్లను రోడ్డున పడేయవద్దని, వారి పొట్టలు కొట్టొద్దని, వారికి సంస్థలోనే ప్రత్యామ్నాయం చూపి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు డిమాండ్ చేశారు. తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి ఆధ్వర్యంలో విద్యుత్ మీటర్ రీడర్స్ మంగళవారం విద్యుత్ డీఈ కార్యాలయం ముట్టడించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, గతంలో సంస్థ సిఎండి మీటర్ రీడర్స్‌కు మినిట్స్ రూపంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. సబ్ స్టేషన్లలో ఐటీఐ అర్హత ఉన్న వారిని షిఫ్ట్ ఆపరేటర్ గాను, వాచ్ అండ్ వార్డ్‌గా నియమించా లని నెక్కంటి డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడిన సర్కిల్ ఆఫీసుల్లో అర్హతను బట్టి కంప్యూటర్ ఆపరేటర్స్ గాను, అటెండర్స్ గాను, వాచ్మెన్ గాను నియమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐటి యుసి డివిజన్ కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్, పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయరావు, యూనియన్ డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాసు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి సి.బాలాజి, సెక్రటరీ పి.వెంట్రావు, నాయకులు కె.సాగర్, కె.సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై ఎన్నికల హామీని నెరవేర్చాలి

విశాలాంధ్ర -భీమవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సిపిఐ భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. మంగళవారం భీమవరం మండలం నాగిడిపాలెం గ్రామంలో ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాల దరఖాస్తులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ప్రజలకు ఇస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు, చెప్పిన హామీని అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఇళ్ల స్థలాలు కాకుండా పెన్షన్లు, రేషన్ కార్డులు మహిళలకు బస్సు సౌకర్యం, తల్లికి వందనం ఇంకా ఎన్నో హామీలు ఇచ్చారని వాటిని ప్రభుత్వం అమలు చేయాలని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు చాంద్‌బాషా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కూడా కల్పించాలని అనేక రోడ్లు పాడైపోయినప్పటికీ ఆ రోడ్లు నిర్మాణంలో జాప్యం కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో నాగిడిపాలెం శాఖ కార్యదర్శి నాగిడి నాగరాజు, తిరుమాని శ్రీరాములు, నాగిడి నర్సింహస్వామి, తిరుమాని విమల దేవి, రావమ్మ, నాగిడి నాగమణి లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎక్కడినుంచైనా ఈ పుస్తకాలు చదువుకోవచ్చు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : విద్యార్థులు ఎక్కడినుంచైనా గ్రంథాలయంలోని ఈ పుస్తకాలు, ఈ జర్నల్స్ చదువుకుని విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని ఏపీ నిట్ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ టి.కార్తికేయ శర్మ తెలిపారు. ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ వి.దినేష్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సంస్థలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో నింబస్ రిమోట్ యాక్సెస్ సాఫ్ట్ వేర్ పై ఆయన అధ్యక్షతన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తికేయ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతి అడుగు వారి విజయానికి మెట్టుగా నిలవాలన్నదే సంస్థ లక్ష్యమని, దీనిలో భాగంగానే విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులను సమకూర్చుతున్నామని చెప్పారు. ఆధునిక డిజిటల్ యుగంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకుని ముందుకెళ్తే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. విద్యారులు ఎవరైనా వారికి నచ్చిన సమాచారాన్ని ఈ నింబస్ సాఫ్ట్ వేర్ ద్వారా క్షణాల్లోనే తెలుసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం గ్రంథాలయంలో కొన్ని వేల ఈ పుస్తకాలు, ఈ జర్నల్స్ ను అందుబాటులో ఉంచామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్ కమలా మోహంతి మాట్లాడుతూ మెరుగైన భవిష్యత్తు కోసం కలలు కనే విద్యార్థులకు ఈ నింబస్ సాఫ్ట్ వేర్ ఎంతగానో ఉపయోగ పడుతుందని వివరించారు. రిసోర్స్ పర్సన్ మణికందన్ మాట్లాడుతూ నింబస్ సాఫ్ట్ వేర్ పనితీరు, దాని ప్రాధాన్యత, ఉపయోగాలు గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కాశీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో క్లస్టర్ విధానం అమలు

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో క్లస్టర్ విధానం అమలు సాధ్యాసాధ్యాలపై పునర్ పరిశీలించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖలో కీలకమైన స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో క్లస్టర్స్ పునర్నిర్మాణంపై స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం ఏలూరు డివిజన్ ఎస్ఎంసి, హెచ్ఎం, ఎంఇఓలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొన్నారు. జీఓ 117 రద్దు నేపథ్యంలో పాఠశాలలను శాటిలైట్ స్కూల్స్, ఫౌండేషనల్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, హై స్కూల్స్ గా మార్పులకు సంబంధించి తల్లిదండ్రులకు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులకు వివరించి పాఠశాల వారీగా తీసుకున్న అభ్యంతరాలను, అంగీకారాలను కలెక్టర్ ఆరాతీశారు. సమావేశంలో ఏలూరు డివిజన్ లోని 11 మండలాలకు చెందిన ఆయా పాఠశాలల్లో ఎంఇఓలు, ఎస్ఎంసి చైర్మన్ లు, హెచ్ఎంలు పాల్గొని స్కూల్ మోనిటరింగ్ కమిటీలో తీసుకున్న తీర్మానాల వివరాలను వివరించారు. సదరు విషయంపై మరోసారి చర్చించుకొని తెలిపితే, తుదిగా స్కూల్ మేనేజింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఆయా పాఠశాలల్లో ఎంఇఓలు, ఎస్ఎంసి చైర్మన్ లు, హెచ్ఎం లు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పై అవగాహన

విశాలాంధ్ర-లింగపాలెం: ఫిజియోథెరపీ వల్ల అనేక వ్యాధులనుంచి కోలుకోవచ్చని ఫిజియోథెరపిస్టు యు.వెంకట రమణ తెలిపారు. లింగపాలెం రెవిన్యూ కార్యాల యంలో రెవెన్యూ అధికారులకు,గ్రామ రెవెన్యూ అధికారు లకు, సిబ్బందికి ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడు వత్తిడిని అధిగమించవచ్చని అన్నారు. విధుల నిర్వహణలో అనేక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఇటువంటి సమయంలో ఫిజియోథెరపీ ద్వారా వ్యాధుల నుంచి కోలుకోవచ్చని అన్నారు. పక్షవాతంతో పాటు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఫిజియోథెరపీ ద్వారా నయం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాద్, రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కలిసిన మెడికల్ ఎంప్లాయిస్

విశాలాంధ్ర - గణపవరం: పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న డాక్టర్ గీతా బాయ్‌ని మర్యాద పూర్వ కంగా మంగళవారం భీమవరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఐఎన్‌టియుసి 3194 పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, గణపవరం ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు వారి బృందం పి సుకుమార్, ఎ. మూర్తి, కె.శాంతమూర్తి, హరిబాబు, ఎం పి హెచ్ ఈ ఓ అసోసియేషన్ బృందం కలసి శుభాకాంక్షలు తెలిపారు.

పగటి వెలుగులు

విశాలాంధ్ర - పెనుమంట్ర: నెగ్గపూడి చివర వనంపల్లి గ్రామంలో సాయిబాబా కాలనీ, గణేష్ నగర్ కాలనీలలో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయి. ఇదే పరిస్థితి గ్రామంలో పలు ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఫలితంగా విద్యుత్ వృధా అవుతుందని ప్రజలు వాపోతున్నారు. కొన్నిచోట్ల దీపాలు వెలగడం లేదు. దీనిపై ఫిర్యాదులు కూడా అందిస్తున్నారు. వీటి మరమ్మతులపై అధికారులు దృష్టి సాధించాలని అక్కడి కాలనీవాసులు కోరుతున్నారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్‌ను కలిసిన సాయిల

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ అనిమిని రవి నాయుడుని, జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ సాయిల సత్యనారాయణ మంగళవారం కలిసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని కార్యాలయంలో చైర్మన్ ను కలిసి చక్రదేవరపల్లి గ్రామంలో గల వాటర్ స్పోర్ట్స్ పాఠశాల నిర్మాణం కొరకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని సాయిల సత్యనారాయణ చైర్మన్ ను కోరినట్లు వివరించారు. చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు సాయిల తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం తెలుగు యువత అధ్యక్షుడు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, కొండ రవి, కొరారి ప్రసాద్, బలుసు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు పని ప్రాంతంలో సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం జల్లి కాకినాడ గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల పని ప్రాంతంలో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ మండల అధ్యక్షులు సోడ దాసీ సంజీవరావు మాట్లాడుతూ పని కావాలని కోరిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. కొత్త జాబ్ కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, కనీస వేతనం 600, పని దినాలు 200 రోజులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి వి ఆర్ సుబ్రహ్మణ్యం, కె రామచంద్రరావు, కేత భవాని, కౌరు సరస్వతి, నేతల సూర్యారావు, బాతు మరియమ్మ, బాతు చిట్టిబాబు, కేతా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు (1వ పేజీ తరువాయి)

నిర్దేశించిన సమయంలోగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. పరిశ్రమల అభివృద్ధి పాలసీని అనుసరించి 13 పరిశ్రమలకు 1. 68 కోట్ల రూపాయలను ప్రోత్సాహకాలుగా మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో వివిధ పరిశ్రమల ఉత్పత్తులకు ఆన్లైన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ మరింత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో భద్రతా నిబంధనలను పాటించని పరిశ్రమలపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు భద్రత ప్రధానమన్నారు. జిల్లాలో గత రెండు నెలల్లో పరిశ్రమలలో ప్రమాదాల కారణంగా మరణాలు సంభవించడంతో పాటు కొంతమంది కార్మికులు గాయాలపాలయ్యారన్నారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు భద్రత ప్రధానమని, జిల్లాలో అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు, హార్టికల్చర్ డిడి రామ్మోహన్,ఎల్డిఎమ్ నీలాద్రి, కార్మిక శాఖ ఉప కమీషనర్ పి. శ్రీనివాస్,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వరరావు,ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కునూరు- భద్రాచలం ప్రధాన రహదారికి మోక్షం

- ఎంపీ మహేష్ కృషి
- రూ.34.50 కోట్లతో 37 కిలోమీటర్లు బిటీ రోడ్డుగా రూపాంతరం

విశాలాంధ్ర - కుక్కునూరు : ఎట్టకేలకు కుక్కునూరు- భద్రాచలం ప్రధాన రహదారికి మోక్షం లభించింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృషి ఫలించడంతో తెలంగాణ - ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లోని వేలేరు నుంచి లంకలపల్లి వరకు 37 కిలోమీటర్ల పొడవునా ప్రధాన రహదారిపై బిటి రోడ్డు వేసే పనులు జోరందుకున్నాయి. ఈ రహదారిలో రాళ్లు పైకి లేచి మోకాళ్ళ లోతు గుంతలుపడి ప్రజలు ఐదేళ్ల పాటు ప్రత్యక్ష నరకం చూశారు. వాహన చోదకులు గుంతల వల్ల తరచూ ప్రమాదాల బారిన పడ్డారు. కొందరైతే ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి భయపడి రద్దు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కా రానికి రహదారిని అభివృద్ధి చేసేందుకు సంకల్పించిన ప్రభుత్వం రూ.34.50 కోట్లు మంజూరు చేసింది. సాంకేతిక కారణాల వల్ల ఏడు నెలల పాటు రహదారి అభివృద్ధి పనులు నిలిచాయి. ఈ రహదారి సమస్యను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి కుక్కునూరు మండలానికి చెందిన నాయకులు, ప్రజలు తీసుకువచ్చారు. గుంతలు పడిన రహదారిలో తాము పడుతున్న ఇబ్బందులను ఎంపీ మహేష్ కుమార్ కు వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీని విజ్ఞప్తి చేశారు.

తక్షణం స్పందించిన ఎంపీ మహేష్ కుమార్ ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించి, రహదారి అభివృద్ధి పనులు నిలిచిపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాంకేతిక సమస్య అధిగమించేలా ఎంపీ మహేష్ తన వంతు కృషి చేశారు. దీంతో రహదారి అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు రోజుల క్రితం పనులు ప్రారంభించారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆర్అండ్బి డీఈ హరికృష్ణ పర్యవేక్షి స్తున్నారు. ఎంపీ మహేష్ కుమార్ చేసిన కృషి ఫలితంగా రహదారి అభివృద్ధి పనులు చేపట్టడంతో ఈ ప్రాంత ప్రజలు పడిన ఇబ్బందుల నుంచి విముక్తి లభించింది.

శక్తియాప్‌పై అవగాహన

విశాలాంధ్ర-భీమడోలు: మహిళా రక్షణే ధ్యేయంగా శక్తి టీమ్ లు పనిచేస్తాయని భీమడోలు ఎస్ఐ సుధాకర్ అన్నారు. మంగళ వారం భీమడోలు శ్రీవెంకటేశ్వర కళాశాలలో శక్తి యాప్ పై అవగాహనా కార్యక్రమాన్ని ఎస్ఐ సుధాకర్ శక్తి టీమ్‌తో కలిసి నిర్వహించారు. ఈ మేరకు తొలుత శక్తి యాప్ పోస్టర్‌ను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ గురించి, శక్తి టీమ్ విధివిధా నాలను అవగాహన కల్పించారు. ఆన్లైన్ మోసాల గురించి వివరించారు. లైసెన్స్ కలిగి ఉన్నవారే వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ చలపతిరావు, రత్నమాణిక కళాశాల ప్రిన్సిపాల్ బొమ్ము రవి, మహిళా పోలీసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ భవనం నిర్మించండి

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు జాతీయ రహదారి పక్కన స్థలములో మండల ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించాలని మంగళవారం ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మికి మండలంలో జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. 25 సంవత్సరాల క్రితం జర్నలిస్టులకు ఉన్న ప్రెస్ క్లబ్ భవనం జాతీయ రహదారి విస్తీర్ణం వలన తొలగించారు. అప్పటినుంచి జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని ఉంగుటూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముప్పన భుజంగరావు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న స్థలములో ప్రెస్‌క్లబ్ కు భవనం నిర్మించాలని ఎంపీపీకి జర్నలిస్టులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు పాండ్రాకుల వెంకట పెద్దిరాజు, కార్యదర్శి పైడి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాసరావు, కోశాధికారి అర్జా బుల్లి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భుజంగరావు మాట్లాడుతూ ఉంగుటూరు మండలప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పత్స మట్ల ధర్మరాజు గతంలో సానుకూలంగా స్పందించారన్నారు. మరోసారి ఎమ్మెల్యే ధర్మరాజును కలుసుకుంటామని భుజంగరావు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయం విరమించుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భీమవరం అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘాల నాయకులు కోనా జోసెఫ్, చికటిపల్లి మంగరాజు, గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కేబినెట్ లో ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని నిర్మించు కోవాలన్నారు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తున్నామని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మీసాల జైరాజ్, కేసి రాజు మాట్లాడుతూ మిశ్రా అన్ని జిల్లాలో తిరిగి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సంస్థలను రమ్మని పిలిచారని, ఈ రిపోర్ట్ నే ప్రభుత్వానికి ఇచ్చి తప్పుడు సంకేతాన్ని అందించారని వారు ఆరోపించారు. దీనిని పూర్తిగా నిరసిస్తున్నామని అన్నారు. దీనిని నిరసిస్తూ 20న జిల్లా కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని అన్నారు. ఈ ధర్నాలో ఈది రవికుమార్, బేతాల కమలాకర్, గాతల సందీప్, గొల్ల రాజ్ కుమార్, అంబటి ఆనంద్ కుమార్, పట్టెం శుభకర్, కొండేటి లాజర్, బండి మధు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఐదుగురు మహిళా ప్రజాప్రతినిధులు సభను నడిపించారు

- 49 ప్రజాప్రతినిధులకు.. కేవలం ఐదుగురు మహిళలే సభలో ప్రశ్నల వర్షం కురిపించారు
- మౌనవ్రతంలో 44 మంది పురుష ప్రజాప్రతినిధులు
- వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక శ్రద్ధ : ఎంపీపీ శ్రీలక్ష్మి
- కంటి తుడుపు పారిశుద్ధ్యం చేస్తే చర్యలు తప్పవు : ఎంపీడీవో మనోజ్

విశాలాంధ్ర- ఉంగుటూరు : గ్రామాలలో వేసవిలో తాగునీరు సమస్య లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండల పరిషత్ సభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. గ్రామాలలో మంచినీటి చెరువులో కాలువ నీరు నింపుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు సూచించారు. ఎంపీడీవో గంజి రాజు మనోజ్ మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుధ్యం పట్ల కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధతో చేయాలన్నారు. కంటి తుడుపు పారిశుధ్య కార్యక్రమాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కృషి చేస్తే భవిష్యత్ తరానికి మంచిదన్నారు. చేబ్రోలులో నిలిచి పోయిన రోడ్డును వెయ్యాలని ఎంపీ టీసీ సభ్యురాలు మనసాల నాగమణి కోరారు. అక్కుపల్లి గోకవరం సర్పంచి మిద్దె సత్యవతి మాట్లాడుతూ గ్రామంలో చనిపోయిన ఆవు గురించి సభలో పేర్కొన్నారు. సభలో ఉన్న ఉంగుటూరు పశువుల ఆసుపత్రి లైవ్ స్టాక్ అధికారి డాక్టర్ మలి పూడి చిన్న బాబురావు మాట్లాడుతూ వైరస్ వలనే ఆవులు చనిపోతున్నాయి అన్నారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దాల్వా సాగు ఆశాజనకంగా ఉందన్నారు. పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలములో 40 సీసీ రోడ్లు, 17 తారు రోడ్లు పనులు జరుగుతున్నాయన్నారు. డ్వాక్రా సీసీ లు మహిళలకు సరైన అవగాహన కల్పించడం లేదని పథకాల కోసం ఇళ్లకు రప్పించు కుంటున్నారని సర్పంచులు రాందే లక్ష్మీ సునీత, అలకనంద, మిద్దె సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు మనసాల నాగమణి, దేవదాసు విజయనిర్మల సభలో ఏపిఎం దృష్టికి తీసుకు వచ్చారు. ఆమె స్పందిస్తూ మండలంలో ప్రజా ప్రతినిధులు తో, వెలుగు సిసి లతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. గొల్లగూడెం ఏఈ వేణు మాట్లాడుతూ వ్యవసాయ బోర్లకు 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లులు రీడింగులు నెల దాటినా తీయటం లేదని సభలో పలువురు పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి అలా జరగకుండా చూస్తానని ఏఈ అన్నారు.

ఆ ఐదుగురు మహిళలే ...

ఉంగుటూరు మండల సమావేశంలో గ్రామాల్లో సమస్యలపై ఆ ఐదుగురు మహిళలే మాట్లాడారు. మండలంలో 27 గ్రామ సర్పంచులు, 22 ఎంపీటీసీలు ఉన్నా గ్రామాలలో సమస్యలు పరిష్కరించడం కోసం ప్రశ్నించవలసిన ప్రజాప్రతినిధులు 49 మందికి కేవలం ఐదుగురు మహిళ ప్రజా ప్రతినిధులు మాత్రమే గ్రామాల సమస్యలపై ప్రశ్నించారు. మిగిలిన 44 మంది ప్రజాప్రతినిధులు పురుషులు మౌనంగా ఉండి పోయారు. ఈ కార్యక్ర మంలో ఏపీఓ ఖాజావల్లి, అంగనవాడి సూపర్వైజర్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొ న్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన కాకర్లమూడి గ్రామ సర్పంచి కాళ్ల నాగ వెంకట సత్యనారాయణ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి మండలం పేరా రామచంద్రపురానికి చెందిన సీత అనే మహిళ సారా విక్రయిస్తుండగా దాడి చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ ఎల్ శ్రీను నాయక్ మాట్లాడుతూ పిఠాపురంలో సారా విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో రైడ్ చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సీతపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

సబ్సిడీతో రుణసౌకర్యం అందజేత

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో బీసీ కాపు కార్పొరేషన్ ఓసీలకు సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు దేవరపల్లి ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి మండల ప్రత్యేక అధికారి ఎస్ సత్యనారాయణ పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రన్న స్వయం ఉపాధి సోపానం కింద దేవరపల్లి మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 28 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 38 యూనిట్లు , ఓసీలకు 7 యూనిట్లు మంజూరైన తెలిపారు. ఈనెల 18 నుండి 22వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా ఓబి ఎంఎంఎస్ డాట్ ఏపీ సి ఎఫ్ ఎస్ ఎస్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. 18 నుండి 60 సంవత్సరాలు వయసుగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు ఒక్కొక్క యూనిట్కు రెండు లక్షల నుండి 5 లక్షల వరకు రుణం మంజూరు అవుతుందని దీనిలో 50 శాతం సబ్సిడీ ఉంటుందని వారు తెలిపారు. ఓసీలకు ఏడు యూనిట్లు మంజూరయ్యానిని అర్హులైన వారు దరఖాస్తు చేసుకొని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో మే నెల ఆఖరు నాటికి 283 ఇండ్లు వివిధ దశలలో ఉన్న ఇల్లు తేదీ నాటికి పూర్తి చేయటానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఒక్కొక్క ఇంటికి 1,80,000 జరుగుతోందని వివిధ దశలలో ఉన్న గృహాలకు బీసీలకు 50,000 ఎస్టీలకు 75000 ఇవ్వటం జరుగుతుందని తెలిపారు . మరో లక్ష రూపాయలు నేనూరుణ సౌకర్యం కల్పించడం జరుగుతుందని సత్యనారాయణ తెలిపారు

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని ఏలేశ్వరం మండల అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి అన్నారు. ఈ మేరకు మండలంలోని మర్రివీడు గ్రామంలో మంగళవారం మండల పరిషత్ నిధుల నుండి గ్రావెల్ రోడ్స్ నిర్మాణానికి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుజ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఇందులో భాగంగా మండలంలోని అభివృద్ధి పనులకు ఇప్పటికే స్థానిక శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ శంకుస్థాపనలు చేశారని అన్నారు. రానున్న రోజులలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, టీడీపీనాయకులు శ్రీకాంత్, బుజ్జిరాజు, ఆర్డబ్ల్యుఎస్ జెఈ పాల్గొన్నారు.

సేవాకీయం ట్రస్ట్ సేవలు అభినందనీయం

కరకుదురు గ్రామ పంచాయతీకి వాటర్ ప్యూరిఫైడ్ ఫిల్టర్ అందజేత

విశాలాంధ్ర - పెదపూడి : గ్రామాభివృద్ధికి, సామాజిక సేవలు విస్తరిస్తున్న సేవాకీయం ట్రస్ట్ సేవలు అభినందనీయమని కరకుదురు గ్రామ సర్పంచ్ పుండ్రు చంద్రకళ అన్నారు. కరకుదురు గ్రామ పంచాయతీకి ట్రస్ట్ అధ్వ ర్యంలో సుమారు రూ.25వేలు విలువగల వాటర్ ప్యూరీ ఫైడ్ ఫిల్టర్ మంగళ వారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిత్యం సేవ కార్యక్రమాలు చేస్తూ అందరికి అందుబాటులో ఉంటున్న సేవాకీయం ట్రస్ట్ సేవలు కొనియాడదగినవి అన్నారు.

సమస్యల పరిష్కారం కోసం సహకరించండి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

విశాలాంధ్ర - సీతానగరం, రాజానగరం: రాజానగరం నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భేటీ అయ్యి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ సీతానగరం మండలంలో పురుషోత్తపట్నం భూసేకరణ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, సత్య సాయి డ్రింకింగ్ వాటర్ సిబ్బందికి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ముఖ్యంగా కాతేరు, సీతానగరం ప్రధాన రహదారి, సీతానగరం, పురుషోత్తపట్నం ఎట్టిగట్టు పంచాయతీ రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేలా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇంకా కోరుకొండ ఇనాం భూములు, నియోజకవర్గ వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు, కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం అభివృద్ధి, జూలై వరదల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఇళ్ల స్థలాలకు నిమిత్తం భూములు ఇచ్చినవారికి నష్టపరిహారం చెల్లించాలని, ఈ ఏడాది ధాన్యం రైతులకు ఆఖరి ధాన్యం తాలుకా ఇవ్వాల్సిన బకాయిలను రైతులకు వెంటనే చెల్లించాలని, 2027 పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని సీతానగరం ప్రాంతంలో ఎనిమిది ఘాట్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎంకు వినతి పత్రం అందచేయడం జరిగింది అని అన్నారు.

జాబ్మేళాలో 23 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన ఉద్యోగ మేళాకు వివిధ ప్రాంతాల విద్యార్థులు 63 మంది హాజరు కాగా ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి 28మందికి తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు, ఏపీఎస్ఎస్డిసి మేనేజర్ ఎమ్ కొండలరావు మాట్లాడుతూ ఇలాంటి ఉద్యోగమేళాలు విద్యార్థులను ఉద్యోగానికి సిద్ధం చేసేందుకు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పివివి సత్యనారాయణ, అకడెమిక్ కో-ఆర్డి నేటర్ విశ్వేశ్వర్, అధ్యాపకులు మల్లికార్జునశర్మ, సత్యలత ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు.

పొట్టి శ్రీరాములు 58 అడుగులు విగ్రహం ఏర్పాటుపై

ఆర్యవైశ్య సంఘం నేతల హర్షం

విశాలాంధ్ర - దేవరపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగులు విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి నిర్ణయించడం పట్ల దేవరపల్లి ఆర్యవైశ్య సంఘం నేతలు మంగళవారం దేవరపల్లిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు పొట్టి శ్రీరా ములు శ్రీమతి పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాకుళపు కాశీ కృష్ణ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహంతో పాటు శృతి వనం ఏర్పాటు చేయటం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు బిజెపి నాయకులకు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఆర్యవైశ్య ప్రముఖులు గతంలో తెలుగుదేశం. నెల్లూరికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు వాసవి కన్య కాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంచనాయాలతో చేయటం శుభ పరిణామం అన్నారు. గన్నవరం విమానాశ్రయానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని దేవరపల్లి ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు తీగల బలరామయ్య కొత్త జుజ్జుఖి బాబురావు సత్తా పెల్లి ప్రభాకరరావు వెలగా శ్రీనివాస్ సుతా పెల్లి నాగరాజు సుతాపెల్లి వెంకట రామారావు సీతా పెల్లి రత్నాజీ చలంచర్ల రాము వెలగా వీర వెంకట సత్యనారాయణ పులపర్తి ప్రసాద్ ప్రసాద్ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు అలాగే అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు శృతి వన పరిరక్షణ సమితి రాష్ట్రపాధ్యక్షుడిగా ఎన్నికైన కాశీ కృష్ణను ఆర్యవైశ్య ప్రముఖులు ఘనంగా సత్కరించారు.

జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకం

విశాలాంధ్ర - అనపర్తి : ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ అంత్యంత కీలకమని ఈ దశలో జీవిత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధన దిశగా పయ నిస్తే విజయం సాధ్యమని ఎమ్ఎన్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి అన్నారు . మంగళవారం స్థానిక కెనాల్రోడ్లోని ఎమ్.ఎన్.ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం కళాశాల ప్రిన్సి పాల్ తాడి సతీష్ రెడ్డి అధ్యక్షతన వేడుకగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ తమ చిన్నారుల భవిష్యత్ పట్ల తల్లిదండ్రులు ఏర్పర్చు చుకున్న కలలు, లక్ష్యాలను సాధించి వారికి ఆనందం కలిగించినప్పుడే జీవితానికి నిజమైన సార్ధకత చేకూరుతుందని అన్నారు. నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అంద జేశారు. నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్ఎన్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు మల్లిడి నారా యణరెడ్డి, సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవి లత, శ్రీ సాయి మాధవి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్స్ తేతలి రామభద్రారెడ్డి, ఎన్.నవీన్, సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అమన్ రషీద్, పి.శివయ్య పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : ఓటర్ల జాబితా సంక్షిప్త సవర ణను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజ కీయ పార్టీలు సహక రిం చాలని కాకినాడ జిల్లా హౌసింగ్ పీడీ, జగ్గం పేట నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్వివి సత్యనారాయణ కోరారు. మంగళవారం జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజ కీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్షాళన, భావితరం ఓటర్లను చేర్పిం చుట, మరణించిన ఓటర్లను గుర్తించుట, పోలింగ్ కేంద్రాల మార్పులు, ఓటర్ల పేరులు సవరణలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం తహశీల్దార్లు జెవి యర్ రమేష్, శ్రీనివాస్, చిరంజీవి, ఎం సాయి ప్రసాద్, వైసిపి తరుపున ఒమ్మి రఘురామ్, టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, జనసేన నాయకులు బద్దుకొండ వెంకటరమణ పాల్గొన్నారు.

23న మండల సమావేశం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవి కుమార్ తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ కారే సుధా అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖ అధికారులు ప్రగతి నివేదికతో హాజరు కావాలన్నారు. ఈ సమావేశం ఉదయం 10.30 ప్రారంభమవుతుందని తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం ఏరి యా డెవల ప్మెంట్ అథారిటీ (పాడా) పీడీ చైత్ర వర్షిణి మంగళవారం పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, పీఆర్ అధికా రులతో కలిసి మంగళవారం పరిశీలించారు. తొలుత ఆమె కుమారపురం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ చైత్ర వర్షిణి..ఉపాధి హామీ పథకం కూలీలతో ముచ్చటించారు. అనంతరం ఆమె తాటిపర్తి గ్రామంలో జరుగుతున్న బిటీ రోడ్ నిర్మాణ పనులను పరిశీలించారు, అలాగే చెందుర్తి, వన్నె పూడి గ్రామాల్లో నిర్మాణంలో వున్న ఫార్మ్ పౌండ్ పనులని పరిశీలించారు. ఈ పరిశీలనలో పీడీ వెంట ఏపీడీ పి వశంతమాధవి, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై ఆర్డీవో సమీక్ష

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలో జరుగుతున్న వివిధ రెవెన్యూ పనులపై కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ మంగళ వారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి ఆలమూరు తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. జొన్నాడలో జరుగుతున్న రీసర్వేలో తప్పులు తలెత్త కుండా, రైతులకు సమస్యలు లేకుండా పూర్తిచేయాలని సూ చించారు. జీవో నెం 30ను అనుసరించి అభ్యంతరం లేని ఆక్రమణలు గుర్తించాలన్నారు. అనంతరం భూ రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. తహశీల్దార్ కెజే ప్రకాష్ బాబు, డిప్యూటీ తాసిల్దార్ సుబ్బరాజు, వీర్వోలు, విలేజ్ సర్వేయర్లు, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య నారాయణ రెడ్డికి నివాళులు

విశాలాంధ్ర - అనపర్తి, పెద పూడి : గొల్లల మామిడాడకు చెందిన వైసిపి యువనేత నేత ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి(చిన్న హంస) ఆకస్మిక మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనా రాయణ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఆకస్మికంగా మృతి చెందిన తన ముఖ్య అనుసరుడు సూర్యనారాయణ రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి మాజీ ఎమ్మెల్యే సత్తి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇంకా సంతాపం తెలిపిన వారిలో వైసిపి నేతలు గుత్తుల వెంకటరమణ, సాంబత్తుల చంటి, మున్ని, దొంకుబుర్ర కృష్ణ, సత్తి సుబ్బారెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి వెంకన్న బాబు, కడిమి శ్రీనివాస్, సబ్బెళ్ళ మోహన్ రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, ముని రెడ్డి, వీర్రాఘవరెడ్డి, తాడి వెంకట రామారెడ్డి, తాడి గోవింద రెడ్డి తదితరులు ఉన్నారు.

కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో 'ప్రపంచ రీ సైక్లింగ్' దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక ప్రతాప్ నగర్ వద్ద ఉన్న రూబెన్ దంత వైద్యశాలలో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన ప్రపంచ రీ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా నర్సింగ్ విద్యార్థుల కు రీ సైక్లింగ్ పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అద్దాల సత్యనారాయణ మాట్లా డుతూ" గ్లోబల్ వార్మింగ్, గ్రహం మీద మన చెడు అలవాట్ల వలన గలిగిన చెత్తను అరికట్టకపోతే భూమి వచ్చే దశాబ్దాన్ని చూడటానికి జీవించకపోవచ్చని వార్షిక నివేదికలు అంచనా వేస్తున్నాయని, వాతావరణ మార్పుల వల్ల కాలుష్య ముప్పు పొంచి ఉండటంతో సహజ వనరులు ముప్పు కూడా పొం చి ఉన్నాయని అన్నారు. గత దశాబ్ద కాలంగా అత్యంత తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఇది ప్రకృతి వినాశనాన్ని మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా తీవ్రమవుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం మార్చి 18 గ్లోబల్ రీసైక్లింగ్ డే జరుపుకుంటామని, వార్తాపత్రికలు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, తృణధాన్యాల పెట్టెలు, పాల డబ్బాలు అనేవి రోజువారీ పునర్వినియోగపరచదగిన సాధారణ వస్తువులలో కొన్ని, మనం సాధారణంగా పారవేసే వస్తు వులను రీసైక్లింగ్ చేయడానికి కృషి చేస్తే, మనం భూమిపై మరియు మన జీవితాలను మరింత లోతైన రీతిలో ప్రభా వితం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డా శ్రీవల్లి, డా ఏరూషా, లీలా, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 9వ తేదీ అర్ధరాత్రి సిద్ధనాథ్ జ్యువెలర్స్ షాప్‌లో జరి గిన బంగారం, వెండి ఆభరణాల దొంగతనం కేసును ఏలే శ్వరం పోలీసులు చేదించి ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేశా రు. ఈ సందర్భంగా ఏలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ మీడియా సమావేశం నిర్వహించి ముద్దాయిల వివరాలను రికవరీ చేసిన ఆభరణాల వివరాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ తమ సిబ్బందికి వచ్చిన పక్కా సమాచారంతో మంగళవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చోరీకి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు ఇచ్చిన సమాచారంతో వివిధ కేసులలో రికవరీ చేసిన చోరీ సొత్తును స్వాధీన పరుచుకోవడం జరిగిందని, అలాగే చోరీకి పాల్పడిన అత్తిరాల గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లాకు చెందిన కరణం కుమార్, చలంగారిపల్లె గ్రామం, అట్లూరు మండలం, కడప జిల్లాకు చెందిన గుమ్మళ్ళ వెంకట సుబ్బయ్య అనే వ్యక్తులను అరెస్ట్ చేశామని తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో, రికవరీ చేయడంలో ప్రత్యేక కృషి చేసిన ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ జి శ్రీహరి బాబు, ఏలేశ్వరం ఎస్సై ఎన్ రామలింగేశ్వర రావు, రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు, అన్నవరం అడిషనల్ ఎస్సై ఎల్ ప్రసాద్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఐడియల్ కళాశాలలో 21, 22 తేదీలలో జాతీయ స్థాయి సదస్సు

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక ఐడియల్ కళాశాల విద్యుత్ నగర్ క్యాంపస్లో ఎకనామిక్స్, కామర్స్ మరియు మేనేజ్మెంట్ స్టడీస్ డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో ఈ నెల 21,22 తేదీలలో రెండు రోజులు జాతీయ స్థాయి సెమినార్ "మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైసెస్ - గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియా" అను అంశంపై జరుగుతుందని, అకడమిక్ డైరెక్టర్ యమ్ రంజిత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైసెస్ అభివృద్ధి సంస్థ చైర్మన్ టి శివశంకర రావు, కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ముఖ్య అతిథులుగా హాజరవుతారని, ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ ఆర్ సుదర్శనరావు, పూర్వ ఉపకులపతి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, సెమినార్ కీనోట్ అడ్రస్‌గా ప్రొఫెసర్ హిమాచలం దాసరాజు, వెంకటేశ్వరా యూనివర్సిటీ, తిరుపతి, ఎమ్ ఖలీబు, ఐఇఎస్ పూర్వ డిప్యూటీ డైరెక్టర్ ఎమ్ఎస్ఎమ్ఇ ప్రొఫెసర్ ఎమ్ ప్రసాదరావు, పూర్వ రెక్టార్ ఆంధ్ర విశ్వవిద్యాలయం పాల్గొంటున్నారని, దేశంలో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తమ పేపర్లు పంపిస్తున్నారని, సమావేశాలలో దేశ ఆర్థికవృద్ధిలో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలనే ఆలోచనతో ఈ సెమినార్ నిర్వహిస్తున్నామని సెమినార్ చీఫ్ పేట్రన్ మరియు కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డా పి చిరంజీవిని కుమారి తెలియజేసారు. పేట్రన్‌గా కళాశాలల ప్రిన్సిపాల్ డా టి సత్యనారాయణ, కో ఆర్డినేటర్‌గా వి నాగేశ్వరరావు, సెమినార్ కన్వీనర్‌గా డా జి స్టీవెన్ రాజు వ్యవహరిస్తున్నారు.

"ఛాంపియన్ షిప్ 2025 సీజన్-5"కు సన్నద్ధమవుతున్న టీమ్‌లు

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య విశ్వవిద్యాలయంలో 17-3-2025 సోమవారం ప్రారంభమైన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ "ఛాంపియన్ షిప్ 2025 సీజన్-5" పోటీలు రెండవ రోజులో పలు టెక్నికల్ అంశాలలో టెక్నికల్ టీమ్ పరిశీలిస్తూ సాగింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన టీమ్‌లు మండుటెండను సైతం లెక్క చేయకుండా తమ తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా మొదటి రోజు ప్రారంభ కార్యక్రమం అనంతరం టెక్నికల్ తనిఖీ-1, టెక్నికల్ తనిఖీ-2, కాస్ట్ ప్లాన్, బిజినెస్ ప్లాన్ మొదలగు స్టాటిక్ ఈవెంట్స్ నిర్వహించారు. రెండో రోజు బ్రేకింగ్ టెస్ట్, యాక్సిల్ రేషన్, స్కిడ్ పాడ్, ఆటో క్రాస్ టెస్ట్ మొదలు డైనమిక్ ఈవెంట్స్ జరిగాయి. 19-03-2025 బుధ వారం మూడో రోజున ఎండురన్స్ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 3.30 గంటల వరకు సుమారు గంటన్నర సేపు జరుగుతుంది. ఉత్కంఠగా సాగే ఈ ఎండురన్స్ పోటీకి ముఖ్య అతిథిగా డాక్టర్ గంగా రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ అడ్వాన్స్ ఇంజనీరింగ్ గ్రూప్, బెంగళూరు నుండి వస్తున్నారని డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ యస్ రమాశ్రీ, రిజిస్ట్రర్ డాక్టర్ జి సురేష్, వివిధ విభాగాల డీన్‌లు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌డివివి యస్ భీమేశ్వర రెడ్డి, కో ఆర్డినేటర్స్. కే నాగ సురేష్, అడ్డూరి సీతారామమూర్తి, ప్రాజెక్ట్ అసోసియేట్ ఎం శంకర్ సాయి రామ్ మరియు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తుల వీరబ్రహ్మంకు సత్కారం

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని ఉద్యోగులందరికీ అండగా ఉంటూ, వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కారం దిశగా ముందడుగు వేసే గుత్తుల వీర బ్రహ్మం మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని పలు వురు వక్తలు ఆకాంక్షించారు. రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు ఆలమూరు మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు బొంతు లోకేష్ అధ్యక్షతన ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మం గళవారం అభినందన సభ, సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వీరబ్రహ్మం చూపిన ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు వీరబ్రహ్మంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు బి అప్పాజీ, ఎన్ రామచంద్రరావు, పి సుబ్బరాజు, నర్సా పురం డివైఈవో డి మురళి సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ దుర్గాప్రసాద్, పెదపళ్ళ పీహెచ్ సీ డాక్టర్ సాయి కిషోర్, ఆలమూరు మండల ఎలక్ట్రికల్, రెవెన్యూ, పంచా యతీరాజ్, మెడికల్ కో పరేటివ్ సొసైటీ, యుటిఎఫ్, ఎస్టియు, పిఆర్టియు నాయకులు, ఉపాధ్యాయులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఆలమూరు, కపిలేశ్వర పురం, మండపేట, రావులపాలెం బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై శిక్షణ

విశాలాంధ్ర - కపి లేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం అంగర గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద తడి చెత్త,పొడి చెత్త సేకరణ మరియు నిర్వహణ పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. గృహస్తులు నుండి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా బుట్టలు ద్వారా సేకరించి, సంపద తయారీ కేంద్రంనకు తరలించాలని సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపిడిఒ రత్నకుమారి, ఇన్చార్జి ఈవో పిఆర్డి మోహన్ రావు, జిల్లా రిసోర్స్ పర్సన్ భీమేశ్వరిలు వివరించారు. సంపద తయారీ కేంద్రం వద్ద వానపాములు ద్వారా సేం ద్రీయ ఎరువు తయారు అవుతుందని పేర్కొన్నారు. అలా తయారైన సేంద్రీయ ఎరువును విక్రయించడం ద్వారా పం చాయతీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నకుమారి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, కార్యదర్శి మోహన్ రావు, జిల్లా రిసోర్స్ పర్సన్ భీమేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ యర్రా వీరన్న బాబు, ఏఓ రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ సభ్యులు, వివిధ గ్రామాలు నుండి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, పారి శుధ్య కార్మికులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటరమణ థియేటర్ సీజ్

అధిక రేట్లకు టిక్కెట్లు అమ్ముతున్నారని ఆరోపణ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం వెంకటరమణ థియేటర్లో రెవెన్యూ అధికారులు కోర్ట్ సినిమా ప్రదర్శన నిలిపి వేశారు. సినిమా టిక్కెట్లు అధిక ధరలకు అమ్ముతున్నారని వచ్చిన వార్తలపై స్పందించిన రెవెన్యూ అధికారులు. వెంకటరమణ థియేటర్లో తనిఖీలు చేపట్టిన ఆర్డీవో కె మాధవి, ఎమ్మార్వో అశోక్ రూ.110 కు అమ్మాల్సిన కోర్ట్ సినిమా టికెట్ రూ.150కు అమ్మి నట్లు గుర్తించామని రెవెన్యూ అధికారులు చెప్పారు. థియేటర్ లైసెన్స్ రెన్యువల్ చేయలేదని, థియేటర్ రికా ర్డులు ఆర్డీవో కె మాధవి తన వెంట తీసుకువెళ్లారు. పూర్తయ్యే వరకూ సినిమా నిలిపివేయాలని ఆర్డీవో మాధవి ఆదేశాలు జారీచేశారు.

ప్రగతి ఇంజనీరింగ్‌లో ముగిసిన వర్క్‌షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం, శ్రీముద్ర టెక్నో ప్రైవేట్ లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో, 17నుండి 18 వరకు "మోడల్ డిజైన్ అనాలసిస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ యూజింగ్ మేట్ లాబ్, సిమ్యులేషన్" అను అంశము పై విద్యార్థినీ, విద్యార్థులకు రెండు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించామని, దీనికి ముఖ్య అతిథిగా జి శరత్ చంద్ర, శ్రీముద్ర టెక్నో ప్రైవేట్ లిమిటెడ్ వారు విచ్చేశారని కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియచేసారు. ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ డా జి నరేష్ మాట్లాడుతూ, విద్యార్థినీ, విద్యార్థులు అందరూ నిరంతరం తమను తాము మెరుగు పరచుకుంటూ, భవిష్యత్తు లో మెరుగైన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడం కోసం వర్క్షాపు అనంతరం కూడా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో సుమారు 150కి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిజేస్తూ, ఇటువంటి వర్క్ షాప్ నిర్వహించుకోవడానికి తమకు అవకాశం కలిపించిన ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యానికి తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముఖ్య అతిధులకు తమ అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మానేజ్మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరెక్టర్-అకడమిక్స్ డా కె సత్యనారాయణ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ వర్ధంతి సభను విజయవంతం చేయాలి

- మహనీయుల స్ఫూర్తిని యువతఅనుసరించాలి
- ప్రభుత్వ వర్సిటీలను పరిరక్షించుకోవాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్

విశాలాంధ్ర - రాజానగరం : భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు సైతం తృణప్రాయంగా విడిచిపెట్టిన భగత్ సింగ్, రాజ్‌గురు సుఖ్ దేవ్ వంటి మహనీ యుల చరిత్రలను నేటి యు వత స్ఫూర్తిగా తీసుకొని అన్ని అంశాల్లో అనుసరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీ ఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ ల 94 వ వర్ధంతి సభను పురస్కరించుకొని మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్క రించారు. ఇందుకు సంబంధించి పత్రికా ప్రకటన ను మంగళవారం విడుదల చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు చోట్ల ఈనెల 23వ తేదీన భగత్ సింగ్ రాజ్‌గురుసుఖదేవుల 94వ వర్ధంతి సభలు, సదస్సులు, నాటికలు, కాగడ ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీ, వినుత్న కార్యక్రమాలను తలపెట్ట మని, వీటిని యువత జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పిలుపునిచ్చారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయం ప్రో.సత్యనారాయణ మట్లాడుతూ సామాజిక అవసరాలు తీర్చే విధంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉపా ధ్యక్షులు కె.భాను ప్రసాద్, నగర కార్యదర్శి దినేష్, నాయకులు మణికంఠ సంతోష్, వంశీ, అప్పారావురెడ్డి, సోమశేఖర్ రెడ్డి, బాలు దొర,

గ్రామ పంచాయతీ కార్యాలయం-గోకవరం

తూర్పు గోదావరిజిల్లా

టెండరు నోటీసు తేది: 18-03-2025

తూర్పుగోదావరి జిల్లా, గోకవరం మండలం **గోకవరం** గ్రామ పంచాయతీకి చెందిన ఈ దిగువ పనులను **2025-26వ** సంవత్సరమునకు నిర్వహించుటకుగాను **ది.24-03-2025 తేది సోమవారం మధ్యాహ్నం 3.00గంటలకు గోకవరం** గ్రామ పంచాయతీ కార్యాలయంలో సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వారిచేగాని వారిచే అధికారం ఈయబడిన వారిచేగాని సీలు వేయబడిన టెండర్లు స్వీకరింపబడి అదేరోజున హాజరైన టెండరుదారుల సమక్షములో **సాయంత్రం గం॥ 3.30ని॥** తెరవబడునని ప్రకటించడమైనది. టెండరు దాఖలు చేయువారు నిర్ణయించిన టెండర్ ధరావత్తును చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. ధరావత్తులు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు. ఇతర వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయం పనిచేయు దినములలో తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	ఐటమ్ వివరము	చెల్లించవలసిన ధరావత్తు
1.	2025-26 సంవత్సరమునకు కన్సర్వెన్సీ సామానుల సరఫరా	రూ.500/-
2.	2025-26 సంవత్సరమునకు అవసరమగు ముగ్గు, బ్లీచింగ్ ఫినాయిల్ సరఫరా	రూ.500/-
3.	2025-26 సంవత్సరమునకు రక్షిత మంచినీరు పథకం పైపులైను సామాగ్రి సరఫరా	రూ.500/-
4.	2025-26 సంవత్సరమునకు పారిశుధ్య నిర్వహణ నిమిత్తం 4గురు డ్రైన్ క్లీనర్లను సరఫరా చేయుటకు	రూ.500/- (ఒక్కొక్కరికి)
5.	2025-26 సంవత్సరమునకు పి.డబ్ల్యు.యస్. బోరు ఆపరేటర్ (4)గురు	రూ.500/- (ఒక్కొక్కరికి)
6.	2025-26 సంవత్సరానికి పారిశుద్ధ్యం నిమిత్తం 28 (25+3) మంది మనుష్యులు మరియు 1 శానిటరీ మేస్త్రీని ఒక ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా సరఫరా చేయుటకు.	రూ.5000/-
7.	2025-26 సంవత్సరానికి పంచాయతీ ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేయుటకు 4 మనుషులు	రూ.500/-
8.	2025-26 సంవత్సరంనకు కంప్యూటర్ ఆపరేటర్ సేవలు వినియోగించుటకుగాను	రూ.500/-
9.	2025-26 సంవత్సరంనకు నైట్ వాచ్‌మేన్ సేవలు వినియోగించుటకుగాను.	రూ.500/-

నోటు : నిధుల లభ్యతను బట్టి పేమెంటు జరుపబడును.

స్థలం : గోకవరం సం/- బి.శిరీష

తేది : 18-03-2025 పంచాయతీ కార్యదర్శి, గోకవరం

జెఎన్‌టియుకె ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం

కాకినాడలోని ఆర్‌టిసి బస్ స్టేషన్ నందు భారీ పరిశుభ్రతా కార్యక్రమం

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ మరియు హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ సూచనల మేరకు జెఎన్‌టియుకె ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో 18మంగళవారం ఉదయం కాకినాడలోని ఆర్‌టిసి బస్ స్టేషన్ నందు భారీ పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా జి శ్యామ్‌కుమార్ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముందుగా యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాధ్ ప్రారంభించగా యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ జివిఎస్ఆర్.దీక్షితులు, ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టరేట్ నుంచి సంజయ్ కుమార్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ రవీంద్రనాధ్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన పర్యావరణాన్ని పరిరక్షించడంలో మన వంతు పాత్ర పోషించినట్లవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా జి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ మరియు హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ మార్గదర్శ కాల ప్రకారం ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎం రామకృష్ణ సహకారంతో కాకినాడలోని ఆర్‌టిసి బస్ స్టేషన్ వద్ద భారీ పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె యుసిఇకె ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె రమణాజీ, ఎంవిఎన్‌వి కిరణ్మయి, డా పి వీరలక్ష్మి, బోధ నేతర సిబ్బంది, జెఎన్‌టియుకె, అనుబంధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కాకినాడ ఆర్‌టిసి డిపో మేనేజర్ ధర్మారావు, ఆర్‌టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన

విశాలాంధ్ర - రావులపాలెం : జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠ శాల రావులపాలెంలో ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ ఢిల్లీ వారిచే అయోడిన్ లోపం వల్ల పిల్లలకు ఎటు వంటి అనారోగ్యాలు వస్తాయనే దాని గురించి పోషణ మేళ. ఐజిడి కోనసీమ జిల్లా కో ఆర్డినేటర్ కే శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ శ్రీనివాస్, మరియు ఎంఈఓ నాగకుమార్, స్కూల్ చైర్మన్ కె సోమేశ్వరరావు పాల్గొని పౌష్టిక మేళాకు సంబంధించి స్టాల్స్‌ను ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ చైర్మన్ మాట్లాడుతూ ఎదిగే పిల్ల లకు ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలి అనే దానిమీద ఐజిడి వారు మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో నమోదు ప్రక్రియ, (హైటు, వేటు), ఆరోగ్యకరమైన వంట పద్ధతులు, మీ ఆహారాన్ని తెలుసుకోండి, పౌష్టికాహారం, విషయాలపై అవ గాహన కల్పించి, రింగ్ గేమ్, క్విజ్, ఏ పోషకాలు దేని నుండి లభిస్తాయి దాని గురించి అవగా హన గెలిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సువర్ణ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఓఆర్‌డబ్ల్యు సిబ్బంది పాల్గొన్నారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం.71 ఎ, పోవై, పాస్పోలి, ముంబై-400087

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ("ది యాక్ట్") & ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 ("ది రూల్స్" నిబంధనల కింద

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఫెడ్‌ఫినా) అధీకృత అధికారియైన దిగువ సంతకందారు చట్టం యొక్క సెక్షన్ 13(2) కింద నిబంధనల 3తో చదివే చట్టంలోని సెక్షన్ 13(12 కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ నోటీసు అందిన తేదీనుంచి 60 రోజుల్లోగా సదరు నోటీసు(లు)లో పేర్కొన్నట్లుగా మొత్తం బకాయిని చెల్లించవలసిందిగా ఈ కింది రుణగ్రహీత(లు)కు పిలుపునిస్తూ డిమాండ్ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణగ్రహీత(లు) డిమాండు నోటీసు(ల)ను స్వీకరించకుండా తప్పించుకుంటున్నారని దిగువ సంతకందారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు కాబట్టి నిబంధనల ప్రకారం గోడకు అతికించడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు అందజేత అమలు చేయబడుతున్నది. డిమాండు నోటీసు(ల)లోని అంశాలు ఈ క్రింద క్రింద సంగ్రహించబడ్డాయి:-

ప. నం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు ఒకవేళ అయితే అస్తి హక్కుదారు	హామీగా పెట్టిన ఆస్తులు/తనఖా ఆస్తుల వివరాలు	చట్టం లోని 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం బకాయి
1	రుణ ఖాతా నెం. **FEDKKISTL0536273** **1. శ్రీ మట్టెర్ల శ్రీనివాసులు తండ్రి రాజులు మట్టెర్ల** (రుణగ్రహీత), డి.సం. 4-164, పంచాయతీ వీధి, కొడవలి గ్రామం, గొల్లప్రోలు మండలం-ఏపి-533449. **2.శ్రీమతి లోవి లోవ లక్ష్మి తండ్రి వీర్రాజు లోవి,** డి.సం. 4-164, పంచాయతీ వీధి, కొడవలి గ్రామం, గొల్లప్రోలు మండలం-ఏపి-533449.	ఐటెమ్ నం.1: తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు ఎస్ఆర్ఓ, గొల్లప్రోలు మండలం, కొడవలి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, సర్వే నం.112/2లో డి.నం.6-16, అసెస్‌మెంట్ నం.781 అధారంగా గల శ్లాబ్ వేసిన భవనంతో పాటు 167.5 చదరపు గజాలు లేదా 140.7 చదరపు మీటర్ల స్థలం యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: ఐటెమ్ నం.2లో 52 అ॥ల స్థలం. పడమర: 52 అ॥ల పంచాయతీ సిసి రోడ్డు, ఉత్తరం: కుక్క రాంబాబుకు చెందిన స్థలం, దక్షిణం: 29 అ॥ల మెయిన్ రోడ్డు. ఐటెమ్ నం.2: తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు ఎస్ఆర్ఓ, గొల్లప్రోలు మండలం, కొడవలి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, సర్వే నం.112/2లో మొత్తం 276.5 చదరపు గజాల స్థలం నుండి 109 చదరపు గజాలు లేదా 91.56 చదరపు మీటర్ల ఖాళీ స్థలం యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: మట్టెర్ల రాంబాబుకు చెందిన ఇల్లు-52 అ॥లు, పడమర: ఐటెమ్ నం.1లోని 52 అ॥ల స్థలం, ఉత్తరం: కుక్క రాంబాబుకు చెందిన స్థలం-19 అ॥లు, దక్షిణం: మెయిన్ రోడ్డు-19 అ॥లు.	తేదీ: 26-02-2025 తేదీ: 25.02.2025 నాటికి రూ.13,36,037.00/- (పదమూడు లక్షల ముప్పైఆరు వేల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే) ఎన్‌పీఏ తేదీ: 04-02-2025

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు(ల)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు చెల్లింపు పరిపూర్ణమయ్యే తేదీ వరకు వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చు మరియు దానితో పాటు పైన పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లించాలని దీని ద్వారా సూచించడమైనది. ఫెడ్‌ఫినా హామీ ఉన్న రుణదాత అని మరియు రుణగ్రహీతలు (లు) పొందిన రుణ సదుపాయం స్థిరాస్తి/ఆస్తులు రుణగ్రహీత(లు) తనఖాగా ఉంచిన హామీగా పెట్టిన ఆస్తి(లు)పై హామీ ఉన్న రుణం అని రుణగ్రహీత(లు) గమనించవచ్చు. రుణగ్రహీత(లు) నిర్ణీత గడువులోగా తమ బకాయిలను పూర్తి స్థాయిలో విడుదల చేయడంలో విఫలమైతే, సర్ఫేశీ చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం హామీగా పెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు అన్ని హక్కులను వినియోగించుకోవడానికి ఫెడ్‌ఫినా కలిగి ఉంటుంది. విక్రయం ద్వారా లేదా చట్టం మరియు నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా బదిలీ చేయడానికి మరియు చెల్లింపును గ్రహించడానికి పరిమితం కాదు. ఫెడ్‌ఫినా అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షిత ఆస్తులు(ల)ను అటాచ్ చేయడానికి మరియు/లేదా సీల్ చేయడానికి కూడా అధికారం కలిగి ఉంది. సెక్యూర్డ్ ఆస్తుల(ల) విక్రయం తర్వాత, ఫెడ్‌ఫినాకు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందేందుకు ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా ఫెడ్‌ఫినాకు ఉంది. ఈ పరిహారం ఫెడ్‌ఫినాకు ఏ ఇతర చట్టం కింద అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు అదనంగా మరియు స్వతంత్రంగా ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, సురక్షితమైన ఆస్తులను విడిపించుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత(ల)ను కోరడమైనది. మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి, రుణగ్రహీత(లు) ఫెడ్‌ఫినా యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, హామీగా పెట్టిన ఆస్తి(లు)ని పరిష్కరించడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఇతరత్రా ఏదైనా పద్ధతుల ద్వారా హామీగా పెట్టిన ఆస్తి(ల)ని బదిలీ చేయడం నుండి నిరోధించబడింది / నిషేధించడమైనది. మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత(లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ పని వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి దానిని పొందవచ్చును.

ప్రదేశము: కాకినాడ సం/- అధీకృత అధికారి,

తేదీ : 19/03/2025 ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

అసంపూర్తి నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర - పెదపాడు : పెదపాడు మండలం వట్లూరులోని హౌసింగ్ కాలనీని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఆశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం లబ్దిదారు లతో మాట్లాడుతూ గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ. 1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీల గృహనిర్మాణానికి అదనంగా రూ. 50 వేలు, ఎస్టీల గృహనిర్మాణానికి రూ. 75 వేలు, పివిటిజి(ఆదివాసి గిరిజనులకు) లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తోందని తెలిపారు. వీటి నిర్మాణాలను ఏప్రిల్ 2025లోగా పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తి చేసుకొనే దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారన్నారు. ఈఅవకాశాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులు సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ కాలనీవాసులు అంతర్గత రహదారులు నిర్మించాలని జిల్లా కలెక్టర్‌కు విన్న వించగా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సదరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్డిఓ అచ్యుత్ అంబరీష్,జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి జి సత్యనారాయణ,డిఈ రమకాంత్, ఎంపిడిఓ అమిలుజామా, వర్క్ఇన్స్పెక్టర్ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,విఆర్ఓ,ట్రా రాంబాబు, శ్రీను, దుర్గారావు ఉన్నారు.

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : కూటమి ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి అనునిత్యం అధిక సంఖ్యలో వస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కూడా ఏలూరు నియోజకవర్గానికి చెందిన ప్రజలు క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే బడేటి చంటికి తమ సమస్యలకు సంబంధించిన వినతులు అందజేశారు. వాటన్నింటినీ స్వయంగా పరిశీలించిన ఆయన సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రోడ్డు నిర్మాణం విషయంలో పొలాలు కోల్పోయిన కొమడవోలు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తమకు రావాల్సిన పరిహారం విషయంపై ఎమ్మెల్యేను కలవగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా పలువురు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్చాలు అందజేశారు. పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని, అన్నివర్గాల వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లపుకొండ కిషోర్, త్రిపర్ణ రాజేష్, మాజీ కౌన్సిలర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఆర్థిక సాయంపై అవగాహన

విశాలాంధ్ర - కోరుకొండ : రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర -2047 విజన్ సాకారంలో భాగముగా 2029 నాటికి " అందరికీ ఇల్లు " కార్యక్రమంలో ఎస్సి, బిసిలకు రూ.50,000, ఎస్టిలకు రూ.75,000 అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు హౌసింగ్ సహాయ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలియ చేశారు. మంగళవారం కోరుకొండ మండలం పరిధిలో గాడాల గ్రామంలో పలువురు లబ్దిదారులను కలిసి అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కోరుకొండ మండలం పరిధిలో 517 మంది గృహ లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టవలసి ఉందన్నారు. వారికీ ప్రభుత్వం అదనంగా అందిస్తున్న ఆర్థిక సహాయం గురించి అవగాహనా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కోరుకొండ మండలం పరిధిలో 517 మంది లబ్దిదారులు ఉండగా ఇప్పటి వరకూ 123 మందికి సమాచారం అందించి, వారిలో 120 మందిని నేరుగా వారిని కలిసి మాట్లాడామన్నారు. వారిలో ఇంటి నిర్మాణం కోసం 89 మంది లబ్దిదారులు గృహ నిర్మాణం కోసం ఆసక్తి చూపినట్లు తెలిపారు. మే నెలాఖరు నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా అవగాహనా కల్పించినట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర -2047 విజన్ సాకారం లో భాగముగా 2029 నాటికి 'అందరికీ ఇల్లు " ఏర్పరచాలనే ధృఢనిశ్చయంతో ప్రభుత్వం వారు చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. మే నెలాఖరు నాటికి జిల్లా వ్యాప్తంగా 21,584 మంది లబ్దిదారులు ఉండగా, ఈ ఏడాది మే నెలాఖరు నాటికి 6 వేల గృహ నిర్మాణాల లక్ష్యాన్ని అనుసరించి ఇప్పటి వరకు 3950 మందిని కలవగా వారిలో 3,147 మంది ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ లబ్దిదారుల అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సహాయం అందజేయడం పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ప్రభుత్వము అందిస్తున్న లక్షా ఎనభై వేలకి అందనంగా మరికొంత ఇచ్చి తమ సొంత ఇంటి కల సాకారం చెయ్యడం పట్ల గాడాల కి చెందిన ఎస్సి లబ్దిదారులు పైడిమల్ల రత్నం , పైడిమల్ల ధనరాజు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యా విధానంలో ఎల్‌కెజీ, యుకేజీ తరగతులే పునాదులు

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం నారాయణ స్కూల్ బ్రాంచ్ లో ప్రిన్సిపాల్ రమణ బాబు అధ్యక్షతన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సి) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా అమలాపురం జోన్ ఏజిఎం శ్రీనివాసరెడ్డి ఆర్ డి హెడ్ సుస్మిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎజిఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో చెప్పిన పాఠాలు, యాక్టివిటీస్, బొమ్మలు, చిత్రాల రూపంలో పొం దుపరిచారు. వాటి ద్వారా విద్యార్థులు ఎంతవరకు నేర్చు కున్నారు అనేది తెలుసుకోవడానికే కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు ఈ ఉపకరణాలు ఉపయోగించి తమ పిల్లలను ఈ విద్యా సంవత్సరంలో లో ఏమి నేర్చుకున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పద్ధతి చాలా బాగుంది దీని ద్వారా పిల్లలు ఎంతవరకు నేర్చుకున్నారు అనే విషయం తెలిసిందని ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహిం చాలని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్ఐ అప్పారెడ్డి, ఏఓ వెంకటరెడ్డి, కో ఆర్డినేటర్ హరిత, నవీన్ ఉపాధ్యాయులు, సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్ కార్యాలయానికి స్థల పరిశీలన

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ భావన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ భావన, పెద్దాపురం ఆర్డీవో కే రమణ మంగళవారం తహసీల్దార్ కార్యాలయమును మార్చుతున్నారు. అలాగే కొత్త కార్యాలయానికి స్థలం పరిశీలించారు. అనంతరం ఉత్తరకంచి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ట్రైన్ని అసిస్టెంట్ కలెక్టర్ వెంట తహశీల్దార్ ఎం సూర్య ప్రభ, ఎస్సై లక్ష్మీకాంతం, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ, మండల సర్వేయర్ బషీర్, ప్రత్తిపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, గ్రామ రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర - ఆలమూరు : రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, వేసవిలో వచ్చే వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు మండలపరిషత్ ప్రత్యేక అధికారి, ఐసిడిఎస్ పిడి శాంతకుమారి అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజు, సీడీపీవో గజలక్ష్మి, ఆండబ్యాస్ ఏఈ పద్మ, ఏవో లక్ష్మీలావణ్య, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై, అంగన్వాడీల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. మండలంలో 8500 ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తయిందని ఏవో ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరకొర వసతులతో పది పబ్లిక్ పరీక్షలు

- వీల్ చైర్ లేక ఇబ్బందులు పడ్డ వికలాంగ విద్యార్థులు
- ఏడు కేంద్రాల్లో ఐదుగురు గైర్హాజరు

విశాలాంధ్ర - రాజానగరం : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రాలు వద్ద అన్ని వసతులు కల్పిస్తున్నమంటూ విద్యాశాఖాధికారులు గొప్పలు చెప్పినప్పటికి సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో విద్యార్థులు అరకొర వసతుల నడుమ మొదటి రోజు తెలుగు సబ్జెక్ట్ పరీక్షలు సోమవారం రాశారు. రాజానగరం మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి మొత్తం 1184 మంది విద్యార్థులకి సంబంధించి ఏడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు సోమవారం ప్రారంభమైయ్యాయి. దీనిలో భాగంగా మండల కేంద్రమైన రాజానగరంలోనీ జడ్పీ హై స్కూల్లో 260 మంది విద్యార్థులకు సంబంధించి జిల్లా ప్రజా పరిషత్తు పాఠశాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రతిఏటా పరీక్షలు వ్రాసేందుకు వచ్చే వికలాంగులు కోసం వీల్ చైర్ సదుపాయం కల్పించే హై స్కూల్ పరీక్ష కేంద్రం అధికారులు మాత్రం ప్రస్తుత ఏడాది ఆ సదుపాయం కల్పించక పోవడతో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు అనేక అవస్థలు పడ్డారు. దీంతో చేసేది ఏమిలేక తల్లిదండ్రులే నడిపించుకుంటూ పరీక్ష గదుల్లోకి తీసుకువెళ్ళల్సిన పరిస్థితి నెలకొంది.అలాగే కొన్ని పరీక్ష గదుల్లో లైట్లు,ఫ్యాన్లు సరిగ్గా లేవని పరీక్షలు అనంతరం విద్యార్థులే స్వయంగా వాపోయారు. అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలోని పేరుకుని పోయిన చెత్తను సరిగ్గా పరీక్ష ప్రారంభమయ్యే సమయంలో చెత్తకు నిప్పు అంటించడంతో పొగ వ్యాపించి కొంత మంది ఇబ్బందులు పడ్డారు. దీంతో తొలిరోజు హై స్కూల్ పరీక్ష కేంద్రంలో అనేక ఇబ్బందులు పడ్డామని, తదుపరి పరీక్షలు నాటికైన సమస్యలు లేని కేంద్రంగా చెయ్యాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.

ఏడు కేంద్రాల్లో ఐదుగురు గైర్హాజరు :

మండలంలోని 1184 మంది విద్యార్థులకు సంబంధించి ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని మండల విద్యాశాఖ అధికారులు ఎం.రామన్న దొర,గుబ్బల జ్యోతి ప్రసాద్ అన్నారు.1184 మందికి ఐదుగురు విద్యార్థులు గైహాజరు కాగా 1179 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చెప్పారు. ఏడు పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, హెల్ప్ డేస్క్ తదితర సదుపాయాలు కల్పించామని తెలిపారు..

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ఒక బాలుడు తప్పిపోయి తిరుగుతుండగా సామర్లకోట ఎస్ఐ అడపా గరగారావు తల్లిదండ్రులు చెంతకు చేర్చారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో రైల్వే స్టేషన్ సెంటర్లో బాలుడు తప్పిపోయి తిరుగుతున్నాడని ట్రాఫిక్ ఎస్ఐ దృష్టికి రావడంతో ఎస్ఐ బాలుడితో మాట్లాడగా అడ్రస్ చెప్పలేకపోవడంతో,బాలుడు వద్ద సెల్ ఫోన్ ఉండడాన్ని గమనించి సిమ్‌ను వేరొక ఫోన్‌లో వేసి ఫోన్ నెంబర్లలో వాళ్ళ బంధువులకి ఫోనే చేసి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. బాలుడు తల్లిదండ్రులు అపర్ణ టైల్స్ షాప్‌లో పనిచేస్తుండగా సెల్‌ఫోన్లో ఆడుకుంటూ దారి తప్పి స్టేషన్ సెంటర్‌కు చేరుకున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు బాలుడిని అప్పగించారు.